
# వాస్తు జ్ఞాని

శ్రీ చరణ్ మిత్ర



"మన త్రినాథ్ కొత్తగా ఇల్లు కట్టాడు తెలుసా?" అన్న సుబ్బారావు మాట విని ఉలిక్కిపడ్డాను.

అంటే సుబ్బారావు నాకు మళ్ళీ వాస్తు గురించి చెప్పబోతున్నాడన్నమాట. నా గుండె దడదడా వణికింది. ఎక్కడ ఏ ఇల్లు ఎలా కట్టబడినా వాస్తుమూలల గురించి, వాటిలో ఉన్న గుణదోషాలతో అవతలివారిని ఊదరగొట్టి చంపేయడంలో సుబ్బారావు సిద్ధహస్తుడైపోయాడు మరి.

"ఆహా, అలాగా" అన్నాను నేను ముక్తసరిగా.



"కానీ చాలా దోషాలతో కట్టేశాడురా, ఎవరినైనా అడిగి ఉండాల్సింది పాపం. ఈశాన్యంలో ఎత్తు పెంచేశాడు పాపం. పైగా నైరుతి కాస్తా వంపు కూడా వచ్చింది".

"పాపం" అన్నాను నేను కాస్త వ్యంగ్యంగా.

"అవును" అంటూ వాడు నా వ్యంగ్యాస్త్రం పట్టించుకోకుండా వాస్తు దోషాలు, వాటి సవరణలు, వివరాలు అంటూ ఎక్స్‌ప్రెస్ రైల్లా చెప్పుకపోతున్నాడు.

నిజం చెప్పాలంటే సుబ్బారావు వ్యక్తిగతంగా మంచివాడే కానీ ఈ మధ్య సంవత్సరకాలంగా ఈ వాస్తు గురించి తెలుసుకొని ఒకటే నసపెట్టేస్తున్నాడు.

ఆ మధ్య వాడు పని దొరక్క ఒక ప్రయివేటు లైబ్రరీలో పని కుదిరాక, అందులో దొరికే రకరకాల పుస్తకాలను చదవడమే పనిగా పెట్టుకున్నాక, తన ఇంట్లో తిష్టవేసుక్కూర్చున్న దారిద్ర్యానికి వాడి నిరుద్యోగానికి, వాడి అక్కకు పెళ్లి కాకపోవడానికి,తన ఇంట్లో వారి కష్టానికి, వాడి బాబు చావకముందే కట్టిన తన పెంకుటిల్లే కారణం అనుకుంటూ, ఆ ఇంట్లో ఉంటూ ఏ ఏ దోషాలకు తాను ఎలాంటి కష్టాలు అనుభవించిందీ బేరీజు వేసుకుంటూ వాస్తు విజ్ఞానంలో దాదాపు పండితుడైపోయినట్లుగా తయారయ్యాడు.

అయితే ఎంతటి పండితుడైనా ముందు తాను ఆచరించి ఆ ప్రయోజనం తనకు సిద్ధించాక చెబితే ఎవరైనా వింటారు కానీ దుర్భర దారిద్ర్యం, ఎడతెగని నిరుద్యోగంలో మగ్గుతున్న సుబ్బారావు గాడి వాస్తు జ్ఞానం గురించి ఎవరు పట్టించుకుంటారు? ఎవరూ పట్టించుకోరు. అయినా వాడు వాస్తు గురించి చెబుతూనే ఉంటాడు.

ప్రస్తుతం నా దగ్గర కూడా అదే సాగుతోంది.

"ఒరెయ్ అంత ఇల్లు కట్టించుకునే వాడు




ఆమాత్రం మంచీచెడ్డా చూపించుకోకుండా కట్టించాడంటావా నువ్వెందుకలా హైరానా పడిపోతావు?'' అన్నాను నేను వాడి వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని. కానీ వాడు ఆగితేగా?

అలా అంటావేమిటి శ్రీనూ గ్రహయోగం బాగు లేకపోతే గృహవాస్తు కూడా అలానే రూపుదిద్దుకుంటుంది. చిన్నచిన్న సవరణలతో గృహవాస్తు సరిదిద్దితే జీవితాల్ని బాగుచేసుకోవచ్చని వాస్తు విద్వాన్ విష్ణుమూర్తిగారు చెప్పారు తెలుసా? అన్నాడు.

ఇక ఆరోజంతా మా త్రినాథ్ కట్టిన ఇల్లు గురించే వాడింట్లో దోషాల గురించే చర్చ ఉంటుంది కనుక ఇక టాపిక్ మార్చాలని నిర్ణయించుకున్నాను కానీ నాకు సాధ్యమయితేగా?

మా సుబ్బారావు గాడి వాస్తు వాక్ప్రవాహానికి నా చెవి అప్పగించినట్టు నటించినా వాడి గురించిన ఆలోచనలు, ఈ వాస్తు విషయాలపై వాడెంత అవమానాలు పొందిందీ నా మనసు నెమరు వేసుకోసాగింది.

ఒకసారి మాకు పరిచయం ఉన్న లక్ష్మీపతి గృహప్రవేశానికి వెళ్ళాం. లక్ష్మీపతి బ్రహ్మాండంగా ఇల్లు కట్టాడు. చూడడానికి చాలా చక్కగా ఉంది. వంక పెట్టడానికే వీలులేకుండా ఉన్న ఆ ఇంటిని వాడు రకరకాల వాస్తుపండితులను సంప్రదించే కట్టాడుట. కాకుంటే మా సుబ్బారావు గురించి, ఎప్పుడో కాలేజీలో వదిలేసిన అనంతరం ఈ మధ్యనే మళ్ళీ కలిసిన లక్ష్మీపతి పొరపాటున మా సుబ్బారావు గాడ్నీ, మమ్మల్నీ తన గృహప్రవేశానికి ఆహ్వానించాడు.

లక్ష్మీపతి ఇల్లంతా మాకు చూపిస్తూ, గది ఎందుకు ఉపయోగించేది చెప్పుకొస్తున్న తరుణంలో సరిగ్గా లక్ష్మీపతి, వాళ్ళావిడ, వాళ్ల బంధువులు ఆడమగా అందరూ ఉన్నదగ్గర రమణ అనే మా మిత్ర బృందంలో వాడొకడు ''ఏమిరా సుబ్బారావు మన లక్ష్మీపతి ఎలాంటి వాస్తుదోషాలు లేకుండా ఇల్లు సంతృప్తికరంగా కట్టాడా?'' అనడిగాడు.

''బాగా కట్టాడు కానీ...'' అంటూ సుబ్బారావు నసుగుతుండగా

సహజంగానే ''ఏమిటి నీ సందేహం?'' అని అడిగాడు లక్ష్మీపతి.

''దక్షిణ ద్వారం గుమ్మానికి ఎదురుగా వీధి కుళాయి ఉంది కదా అది అరిష్టం '' అన్నాడు సుబ్బారావు.

''ఏం చేయను అది పబ్లిక్ కుళాయి మార్చడం కుదరదు''.

''కానీ దాని వల్లే ఇంట్లో ఆడవాళ్ళు పెడదార్లు తొక్కే అవకాశం ఎక్కువ'' అన్నాడు సుబ్బారావు

అంతే..

ఆ ఆడవాళ్ళలో ఉన్న ఒక పెద్దావిడ అందుకుని ''ఏమయ్యా నీకేమయినా బుద్ధుందా. ఈ ఇంట్లో ఆడవాళ్ళు పెడదార్లు తొక్కేవారిలా కనిపిస్తున్నారా. తినడానికి వచ్చిన వాడివి తినేసి ఫో. చక్కగా శుభకార్యం చేస్తున్న గృహలక్ష్మిని గురించి అనాల్సిన మాటలేనా ఇవి నీపెళ్ళాం, మీ ఇంట్లో ఆడాళ్ళు అలాంటి వాళ్ళు అయితే కావొచ్చు కానీ అందరూ అలాంటి వారే అనుకుంటున్నావా. గృహవాస్తు సరిగా లేనంత మాత్రాన అలా తయారు కావడానికి మేమంత పరువు తక్కువ వారం కాదు'' అంటూ ఆవిడ మా సుబ్బారావును ఛడామడా తిట్టేస్తుంటే ఆమెను శాంతపరచడానికి మేమంతా నానాయాతనలు పడ్డాం.

పాపం మా సుబ్బారావు కిక్కురు మనలేకపోయాడు. తరువాత మా మిత్రులంతా వాడినే తలో మాటా అనేసరికి మరింతగా బిక్కచచ్చిపోయాడు. రెండురోజులు మమ్మల్నెవర్నీ పలకరించలేక ఏదో సిగ్గుపడుతూ మొహం చాటేసేవాడు. పాపం వాడంత అవమానం పొందినందుకు నాకూ బాధ అనిపించింది.

''పోన్లేరా... ఏదో మంచి చెప్పబోయావు. చెడుగా భావించారు. అది వారి సమస్యకానీ, నీ సమస్య కాదు కనుక ఇక ఆ విషయం మరిచిపో'' అంటూ రకరకాలుగా ఓదార్చాను.

తరువాత అలా కాస్తా మామూలు మనిషి అయిన సుబ్బారావు ఇదిగో మళ్ళీ ఇలా...

''మనం వెళ్ళి త్రినాథ్‌గాడికి ఎలా అయినా ఆ వాస్తుదోషాలు సవరించుకోమని చెప్పాలిరా'' అంటూ ఏదేదో చెబుతున్నాడు.

''సరేలేచూద్దాం'' అంటూ నేను బలవంతంగా వాడినుండి తప్పించుకున్నా త్రోవంతా వాడి ఆలోచనలే...

'అసలు ఒకసాధారణ వ్యక్తి తనస్వల్పమైన పరిజ్ఞానాన్ని మిగతావారితో పంచుకోవాలని ఎందుకంత ఆరాటపడతాడు?' అని ఆలోచిస్తే తనకు లభించనివి, తనకు అసాధ్యమైనవి ఎదుటివారికి చెబుతూ అదోరకమయిన మానసిక తృప్తి పొందుతుంటాడు. అలా తనలో విస్తరించుకుంటున్న తన ఆలోచనలను, పనులను ఎదుటివారు వినాలని, ఆచరించాలనే కోరిక అంతర్లీనంగా ఉండిపోవడం ఒక కారణం అవుతుంది అనుకుంటే–

అందులో మా సుబ్బారావు కూడా మినహాయింపు కాదు. చిన్నప్పుడే తండ్రినిపోగొట్టుకుని, ఇద్దరి అక్కచెల్లెళ్ళ తరువాత పుట్టిన సుబ్బారావుకు తల్లి ఉన్నా ఎక్కువగా బావగారి దాక్షిణ్యంలోనే పెరిగాడు.

ఏవేవో రకరకాల ఆశలు, ఆశయాలు, కోరికలు ఉన్నా పాపం వాడికవి ఏం తీరనే లేదు. ముసలి తల్లి ఉన్నా నామమాత్రమే. వీడిని పట్టించుకునే వారు దాదాపు లేరనే చెప్పాలి. సరైన పని లేక పోవడమూ, ముప్పై సంవత్సరాలు దాటినా ఇంకా అవివాహితుడిగానే ఉండిపోవడం వాడిని పూర్తిగా నిస్సహాయుడిగా చేసాయి.

ఇంక ఎప్పటికీ పెళ్ళికాని చిన్నక్క, వీడి నిరుద్యోగం, తండ్రి పరంగా వారికి సంక్రమించిన ఒక పాతకాలం పెంకుటిల్లు ఇదేసుబ్బారావు ప్రపంచం.

ఆ ఇంటి వాస్తు సరిగా లేకపోవడం వలనే తనకేదీ కలసిరావడం లేదనేది వాడికి ఒక గట్టి నమ్మకం.

నిజానికి ఆ ఇల్లుకూడా అలానే ఉంటుంది. అసమర్థపు చిత్రకారుడు అస్తవ్యస్తంగా చిత్రించిన చిత్తరువులా అయోమయంగా పద్ధతీ పాడూ లేదా ఇంటికి. ఎప్పుడో పాతకాలంలో కట్టించిన ఇల్లు అప్పటికి ఈ వాస్తువివరాలు అంతగా చలామణిలో లేవనుకుంటాను.

ఆ ఇంటిని ఇప్పుడు చూసిన సాధారణవ్యక్తి కూడా ఇలా ఉండకూడదనే అంటాడు. అలాంటపుడు వాస్తువిషయాల్ని, రహస్యాల్ని పుస్తకాల ద్వారా ఔపోసన పట్టేసిన సుబ్బారావు స్థితి ఎలా గుంటుందంటే.

తాను ఆచరించలేడు. ఇతరులు తాను చెప్పేది వినడం లేదని గోలపెడుతుంటాడు.

జీవితంలో ఎదురు దెబ్బలే ఎక్కువగా ఎదుర్కొన్న సుబ్బారావు మూఢనమ్మకాలపైకి మళ్లడం మాకెవరికీ వింతగా తోచలేదు. జీవితంలో ఎదురైన ప్రతీ సంఘటనకు దరిద్రుడు ఏదో ఒక ప్రకృతి సంబంధమైన కారణం చెబుతుంటాడు.

అలానే సుబ్బారావు 'వాస్తు బాగులేదని'

చెబుతూ గృహవాస్తు బాగులేకుంటే గ్రహవాస్తు సరిగా ఉండదంటూ అందరికీ చెప్పబోతూ వారితో చీవాట్లు తింటుంటాడు.

ఇక వాడిని ఎవడూ మార్చలేం అనుకుంటున్న తరుణంలో–

ఒక రోజు సైకిల్ మీద మా ఇంటికి వచ్చేడు సుబ్బారావు.

''ఏమిటి సంగతి?'' అని అడిగేను.

''మా బావగారు మా ఇంటిని మొత్తం కూలగొట్టి మళ్ళీ కడతానని మా అమ్మతో చెప్పాడట అన్నాడు. ఏదో కొండంత భారాన్ని నెత్తిమీద పెట్టుకున్నంత ఫీలింగ్‌తో.

''ఆహా అలాగా'' అన్నాన్నేను.

''పోన్లేరా ఆ దిక్కుమాలిన ఇల్లు కూలగొట్టి వాస్తుబద్ధంగా మాంచి ఇల్లు కట్టుకుంటే మా బ్రతుకులు ఇకనైనా బాగుపడతాయి'' అన్నాడు దృఢంగా.

''అవును అదే మంచిది''

''అది సరే గానీ శ్రీనూ నీవు మా ఇల్లు తిరిగి కట్టేట్టయితే బ్రిక్స్ నీవు తక్కువ ధరకు ఇస్తానన్నావు గుర్తుందా'' అన్నాడు గతంలో నేను నిర్వహిస్తున్న ఇటుకల వ్యాపారం నుండి వాడికి బ్రిక్స్ ఇస్తానన్న వాగ్దానాన్ని గుర్తుచేస్తూ.

''తప్పకుండా ఎప్పట్నించి పంపించమంటావు?'' అన్నాన్నేను.

''నేను మళ్ళీ వచ్చి చెబుతానుగా'' అంటూ నన్ను ఓ అరగంట పొగిడి వెళ్ళిపోయాడు.

అయితే తను ఇల్లు కడతాను బ్రిక్స్ తీసుకెళతానని అతను చెప్పడం దీనితో అయిదోసారి. చెప్పడం వాయిదా వేయడం. గ్రహవాస్తు బాగులేకే గృహవాస్తు మార్పుచేయడం సాధ్యం కావడం లేదనే మరో సుదీర్ఘమైన వివరణ ఇచ్చేవాడు.

''మా ఇంటి నైరుతీ ముందు మూయకుండా ఏపని అవదురా'' అనేవాడు.

''పోనీ ఆపనే ముందు చేయించవచ్చు కదరా'' అని అంటే నైరుతిలో ఉపగృహం కట్టాలంటే ముందు దక్షిణం వైపు గోడ మొత్తం కూలిపోతుంది కదా అందుకు మా బావ ఒప్పుకోవడం లేదు'' అనేవాడు.

మొత్తం మీద ఏం జరిగిందో తెలియదు గానీ ఇంట్లో అందరూ కొత్తగా ఇల్లు కట్టడానికి సమాయత్తమయ్యారని తెలుసుకుని ఎక్కువగా ఆనందపడింది నేను. ఎందుకంటే మీకు తెలియనిదే ముందండీ. ఈ వాస్తువాయింపు నాకు కాస్త తగ్గుతుందనే చిన్న ఆశ.

***

ఇంచుమించు నెలరోజులు గడిచాయి.

సుబ్బారావు ఈ మధ్య కనిపించడమే మానేశాడు.

బహుశా ఇల్లు కట్టడంలో నిమగ్నమైపోయింటాడు అని మేమంతా అనుకున్నాం.

ఎవరో చూసిన వారు కూడా చెప్పారు సుబ్బారావు వాళ్ళు ఇల్లు కడుతున్నారని.

ఇటుకల కోసం వస్తానన్న సుబ్బారావు రాలేదేమిటా అనుకుంటూనే నా పని వత్తిడిలో నేనూ మరిచిపోయాను.

ఒక రోజు నేను స్కూటర్‌పై వెళుతుండగా ముఖం వేలాడేసుకుని ఒంటరిగా రోడ్డుపై నడచి వెళుతున్న సుబ్బారావుని చూసి బండి ఆపాను.

''ఏంటిరా! ఏకంగా గృహప్రవేశానికి కలసి చెబుదామను కుంటున్నావా ఏమిటి? అసలు కలవడమే మానేశావు'' అన్నాన్నేను నవ్వుతూ.

వాడు ఎలాంటి సమాధానం చెప్పకుండా విరక్తిగా ఒక నవ్వు నవ్వాడు.

నాకు ఏదో సంశయంగా తోచింది. హృదయానికి ఏదైనా గాయమైతేనే సుబ్బారావు మౌనంగా ఉండిపోతాడు ఏదో అయి ఉంటుంది. తెలుసుకోవాలనిపించి ''ఇల్లు వాస్తు ప్రకారం కడుతూ ఉండి ఉంటావు'' అన్నాను. వాడు చివ్వున తలెత్తాడు. వాడి కళ్ళల్లో నీళ్ళు చూసి నేను కంగారుపడ్డాను.

''అరె ఏమయిందిరా? ఏటయింది?'' అనడిగాను గాబరాగా.

''పేదవాడు ఎంతటి పండితుడయినా వాడి మాటకు విలువ ఉండదురా! మా ఇల్లు ఇప్పుడు పూర్తిగా వాస్తు విరుద్ధంగా తయారైంది'' అన్నాడు.

''అదెలా?''

''మా బావగారు తూర్పు భాగాన ఉన్న వసారా మేం ఇవ్వవలసిన అప్పుకు తాను స్వంతం చేసుకుంటానని వాళ్ళే మా ఇంటికి ఎదురుగా ఒక పెద్ద గోడలేపేశారు. తూర్పు ఈశాన్యం మాకు లేనే లేదు. అక్కడ మా బావగారు గోడే అడ్డయిపోతుంది. ఆ ముందు చోటు మా బావగారిదే కనుక వాళ్ళకు వాస్తు బాగానే ఉంది.

నన్నూ అమ్మను పడమట నైరుతి వైపుకు ఉన్న గదిలో ఉంటే ఉండండి, లేదంటే వెళ్లిపోమంటున్నాడు. ఆ ఇంట్లో ఉండాలంటే ద్వారం నైరుతీ వైపుకే తెరుచుకోవాలి. ఆ చోటు కూడా వదిలేస్తే మాకు ఆధారం ఏముంది? నైరుతి వైపు వాలేలా పెంకులు వేశాడు. తూర్పువైపు నీరు పారేలా చేస్తే వర్షపు నీరు వెళ్ళడానికి చోటు ఉండదుట. నేనెంత మొత్తుకున్నా వినలేదు. నా మాట అసలు పట్టించుకోకపోగా నీ సంపాదనతో నీవొక భవంతి కట్టించుకో చేతనయితే'' అంటూ హీనంగా మాట్లాడాడు.

మా ఇంట్లో వారందరికీ మా బావగారూ మాటే వేదం అన్నట్టుగా నేనేం చెప్పినా పట్టించుకోనవసరం లేదన్నట్టుగా ప్రవర్తిస్తూ ఇంటిని మరింత అస్తవ్యస్తంగా తయారుచేశారు. అందరికీ వాస్తు గురించి మంచి చెడ్డలు చెప్పేనేను అలా కట్టబడిన నా ఇంటిని చూస్తే నాకు విలువ ఏముంటుంది?'' అన్నాడు కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరుగుతుండగా. నాకూ ఏం మాట్లాడాలో తోచలేదు.

''నేను చెప్పేది కూడా ఇంట్లోవారి బాగు గురించే కదరా. నామాటెందుకు వారు పట్టించుకోరంటావు'' అని వాడు బేలగా అడుగుతుంటే నాకేం చెప్పాలో తోచక మామూలుగా వాడిని శాంతపరచడానికి ఓదార్చడానికీ అన్నట్టుగా '' ఏముందిరా గ్రహదశ బాగోలేక గృహదిశ సవ్యంగా ఏర్పడదు కదా'' అన్నాను.

''కాదురా పేదరికం, పనిలేనితనం మనిషిని పట్టించుకోనివ్వదు. మనలో మనం ఏర్పరుచుకున్న ప్రతి బంధాలు ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగానే పని చేస్తాయి. పేదరికంలో పాండిత్యానికి, ప్రతిభకు ఎలాంటి విలువా ఉండదు. అదే కారణం... అదే కారణం'' అంటూ కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతున్న అతన్ని చూస్తూ నివ్వెరపోయాను.

టాల్‌స్టాయ్ చెప్పినట్లుగా ''ఆనందమయ జీవిత విషాదాలు అన్నీ ఒకే రకంగా ఉండి, ఒకదాన్ని ఒకటి పోలి ఉంటాయి. నిరుపేదల జీవిత విషాదాలు మాత్రం ఒక్కొక్కటి ఒక్కో ప్రత్యేకతను పోలి ఉంటాయిట.

అలా–

తనకు తెలిసిన వాస్తు జ్ఞానం కన్నా తన పేదరికం వల్ల ఏర్పడుతున్న వాస్తవజ్ఞానం ఇప్పటికి తెలుసుకున్న సుబ్బారావు ఇప్పుడు ఎవరితోనూ – పూర్తిగా మాట్లాడటం మానేశాడు.

★

